సాక్షి
విశాఖపట్నం
గురువారం । 12 । జూన్ । 2025



ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్ల పరిశీలన 8లో



యోగాంధ్ర శిక్షకులకు శిక్షణ 8లో



అప్పన్నకు మూడో విడత చందనం సమర్పణ 8లో



వీరు అల్లూరి జిల్లాలోని హుకుంపేట మండలం పాములాయి గ్రామానికి చెందిన గిరిజనులు. వీరు మొన్నటివరకూ ఇంటి వద్దనే ఎండీయూ వాహనాల్లో రేషన్ తీసుకునేవారు. ఈ నెల రేషన్ కోసం నాలుగు కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి వచ్చింది. కామయ్యపేట డిపో నుంచి రేషన్ తీసుకొని మోసుకొని ఇంటికి రావాల్సిన దుస్థితి ఏర్పడింది.



పెదబయలు మండలం ఇంజరి పంచాయతీ జాలంపల్లి గ్రామానికి చెందిన గిరిజనుడు వంతాల రాజంనాయుడు... జూన్ 8వ తేదీన జి.మాడుగుల మండలంలోని బోయితిలి గ్రామంలో మృతి చెందాడు. మృతదేహాన్ని వెదురు కర్రలకు డోలి మాదిరిగా కట్టుకుని నాలుగు కిలోమీటర్ల మేర కొండలు, గుట్టలు ఎక్కి సొంత గ్రామం జాలంపల్లికి తరలించారు.



ఈ ఫొటోలోని వ్యక్తి అనకాపల్లి జిల్లా బుచ్చెయ్యపేట మండలంలోని శింగవరం గ్రామానికి చెందిన రైతు కలవలపల్లి మాలునాయుడు. ఈ ఏడాది వర్షాలు ముందుగానే వచ్చినా.. ప్రభుత్వం నుంచి పెట్టుబడి సాయం అందక ఉత్సాహం లేదని చెప్పారాయన. జగన్ బాబు ఉన్నప్పుడు పంట సాగుకు ముందే పెట్టుబడికి రైతు భరోసా నగదు బ్యాంకులో పడేదని, ఇప్పుడు అప్పులు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు భరోసా సొమ్ముతో విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు కొని పంటల సాగు చేసేవాడినని తెలిపారు. తనకున్న రెండెకరాల్లో వరి పంట సాగుకు ఆకుమడి దున్ని సిద్ధం చేశానని, కానీ ఈ ఏడు పెట్టుబడి సాయం ఇస్తారో లేదో స్పష్టత లేదని చెప్పారు.



అనకాపల్లి జిల్లా సబ్బవరానికి చెందిన సక్కెళ్ల సన్యాసమ్మకు ఇద్దరు పిల్లలు. భర్త చనిపోవడంతో రెండు ఆవు పెయ్యిలను మేపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటోంది. పశువుల దాణాల ధరలు విపరీతంగా పెరిగిపోయాయని ఆవేదన చెందుతోంది. పాల సేకరణ ధరలు బాగా తగ్గాయి. అప్పుడు అమూల్ ఉన్నప్పుడు పాల సేకరణ ధర బాగుండేదని ఆవేదన చెందుతోంది. పశు వైద్య సిబ్బంది గ్రామంలోని ప్రతీ పశువుకూ బీమా కల్పించారు. ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదని వాపోతోంది.



అందరికీ పంగనామాలు

కూటమి ఏడాది పాలన అంతా మోసం, దగా

సూపర్ సిక్స్ హామీలకు మంగళం

వీరే కాదు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రైతులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, నిరుద్యోగులు, మహిళలు, గిరిజనులు... ఇలా అన్ని వర్గాల ప్రజలూ నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటూనే ఉన్నారు. కొత్తగా ఒక్క పింఛను ఇచ్చింది లేదు... ఒక్క ఉద్యోగం కల్పించిందీ లేదు. సొంత గ్రామంలో గౌరవంగా ఉంటున్న వలంటీర్లను, రేషన్ సరుకులను పంపిణీ చేస్తూ వాహనాన్ని నడిపే నిరుద్యోగ డ్రైవర్లు, వారికి సహకరించే హెల్పర్లు.. ఇలా అందరికీ ఉన్న ఉపాధినీ తీసివేసి రోడ్డున పడవేసింది కూటమి ప్రభుత్వం. ఇక రైతులకు ఉన్న ఊర్లోనే అందే ఎరువులు, విత్తనాలు అందకుం**డా తిరిగి మండల కేంద్రా**లకు వెళ్లి ప్రైవేటుగా అధిక ధరలకు తీ**నుకోవాల్సిన దుస్థితి ఏర్ప**డింది. గడిచిన ఏడాదిగా రైతులకు పె**ట్టుబడి సాయంగా కానీ...** నష్టపరిహారంగా కానీ చిల్లి గవ్వ కూట**మి ప్రభుత్వం అందించ**లేదు. కొత్త పింఛన్ మాట దేవుడెరుగు**... ఉన్న పింఛన్లను తీసే**స్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 2**0 వేల పింఛన్లకుపైగా గత** ఏడాది కాలంలోనే కూటమి ప్రభుత్వం **తొలగించింది. ఒక్క కొత్త** రేషన్ కార్డు ఇవ్వకపోగా... రేషన్ కార్డు**లో మార్పుచేర్పులకే కొత్త** సమస్యలు తెచ్చిపెట్టింది. మహిళలకు **ఆడబిడ్డ నిధి కింద నెల** నెలా రూ. 1,500 అకౌంట్లోకి వేస్తామన్న **హామీ కనీసం ఊసులో** లేకుండా పోయి.. సోషల్ మీడియాలో **మీమ్‌గా మారిపోయింది.** జీవీఎంసీ పరిధిలో కాంట్రాక్టర్లకు బిల్లు**ల చెల్లింపులు ఎక్కడిక**క్కడ పెండింగ్‌లో ఉన్నాయి. కొత్తగా **ఒక్క అభివృద్ధి కార్యక్ర**మాన్ని ప్రారంభించలేదు. కేవలం గత **వైఎస్సార్ సీపీ ప్రభుత్వ** హయాంలో ప్రారంభించిన పనులను **మాత్రమే కొనసాగిస్తోంది.** కనీసం రెగ్యులర్ కమిషనర్‌ను కూడా నియమించలేని దుస్థితిలో కూటమి ప్రభుత్వం ఉంది. పాఠశాలలు నేడు ప్రారంభమవుతున్నప్పటికీ పిల్లలకు పుస్తకాలు కూడా సరిగా అందే స్థితి కనపడటం లేదు. ఇలా గడిచిన ఏడాది కాలంగా కూటమి ప్రభుత్వ హయాంలో ఇటు విశాఖ నగరం... అటు గ్రామాలు, ఏజెన్సీ ప్రాంతాల్లో సంక్షేమం, అభివృద్ధి ప్రజలకు అందకుండా పోయాయి.

– సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం/విశాఖ సిటీ

ప్రతి ఎన్నికలకు ముందు అవే అబద్ధాలు

ప్రతి ఎన్నికలకు ముందు యువత, నిరుద్యోగుల ఓట్లు కొల్లగొట్టేందుకు చంద్రబాబు ఇంటికో ఉద్యోగం, భృతి వల్లెవేయడం పరిపాటిగా మారిపోయింది. 2014 ఎన్నికల్లోనూ అదే అబద్ధంతో చంద్రబాబు అధికారంలోకి వచ్చారు. నాలుగున్నరేళ్ల పాటు సాగదీసిన తర్వాత.. ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో నిరుద్యోగ భృతి పేరుతో హడావుడి చేశారు. ప్రతి నిరుద్యోగికి రూ.2 వేల భృతి అని ప్రకటించి.. చివరికి రూ.1000 మాత్రమే ఇస్తామన్నారు. అది కూడా సక్రమంగా ఇవ్వకుండా రోజుకో కొత్త నిబంధన తీసుకొచ్చి.. నిరుద్యోగులకు ముచ్చెమటలు పట్టించారు.

4.5 లక్షల మంది నిరుద్యోగులు..!

విశాఖ జిల్లాలోని 11 మండలాల పరిధిలో 5.45 లక్షల ఇళ్లు ఉన్నాయి. ఇందులో ప్రభుత్వ, లిమిటెడ్ కంపెనీల పరిధిలోనూ, ప్రైవేట్ ఉద్యోగాలు చేస్తున్న వారి సంఖ్య సుమారు 3.40 లక్షల మంది ఉంటారు. అంటే మిగిలిన 2.05 లక్షల ఇళ్లలో ఉన్న నిరుద్యోగులకు భృతి ఇవ్వాల్సి ఉంటుంది. అంటే.. మొత్తం నిరుద్యోగులు దాదాపు 4.5 లక్షల మంది ఉండే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. వీరందరికీ రూ.3 వేలు చొప్పున ప్రతి నెలా నిరుద్యోగ భృతి ఇవ్వాల్సి ఉంటుంది. అంటే.. ప్రతి నెలా జిల్లాలో ఉన్న నిరుద్యోగులకు రూ.135 కోట్లుకు పైగానే అందించాలి. కానీ కూటమి ప్రభుత్వం ఈసారి కూడా భృతిని అందించే పరిస్థితి లేనట్లు కనిపిస్తోంది.

వైఎస్సార్ సీపీ హయాంలో ఉద్యోగాల వెల్లువ

2019 నుంచి 2024 మధ్య కాలంలో ఉద్యోగాల జాతరే జరిగింది. విశాఖ జిల్లా పరిధిలో 6,500 సచివాలయ ఉద్యోగాల పేరుతో శాశ్వత ఉద్యోగాలు కల్పించారు. అదేవిధంగా ఆప్కోస్ ద్వారా అవుట్‌సోర్సింగ్ కింద 40 వేల ఉద్యోగాలిచ్చారు. కాంట్రాక్టు పద్ధతిలో 1500కిపైగా ఉద్యోగాలు పొందారు. దీంతో పాటు జాబ్ మేళాలు, రాష్ట్రంలో ప్రారంభమైన ఫార్మా, ఉత్పత్తుల **కంపెనీల్లో 50 వేల మందికి పైగా ఉపాధి అవకాశాలు పొందారు. వీరితో పాటు.. సొంత ఊరిలో** సొంత వీధిలో రూ.5 వేల గౌరవ వేతనం పొందుతూ 15 వేల మందికి పైగా నిరుద్యోగులు వలంటీర్లుగా సేవలందించారు. ఇలా ఐదేళ్ల కాలంలో ఎన్నడూ లేని విధంగా ఉద్యోగాలు అందించిన ఘనత వైఎస్సార్ సీపీ సొంతం చేసుకుంది. కూటమి ప్రభుత్వం ఈ తరహా అవకాశాలు కల్పించే అవకాశాలు ఎక్కడా కనిపించడం లేదని నిరుద్యోగులు విమర్శిస్తున్నారు. కొత్త **ఉద్యోగాలు ఇవ్వకపోగా** వలంటీర్లను **తొలగించింది. కాంట్రాక్టు** ఉద్యోగాల్లో **కూడా కోత పెట్టాలని చూ**స్తోంది.

హామీలన్నీ గాలికి..



సూపర్ సిక్స్ పేరుతో బూటకపు హామీలు గుప్పించి ప్రజలను మభ్య పెట్టి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు.. ఇప్పుడు ఆ హామీలు నెరవేర్చడానికి ఖజానా ఖాళీ అయిపోయిందని కుంటి సాకులు చెబుతున్నారు. ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఇస్తానని, ఉచిత బస్సు ప్రయాణమని మాయమాటలు చెప్పారు. ప్రతి రైతుకు ఏడాదికి పెట్టుబడి సాయం కింద రూ.20 వేలు ఇస్తామని చెప్పి అన్నదాతకు వెన్నుపోటు పొడిచారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఐఆర్, పీఆర్‌సీ, పెండింగ్ డీఏలు అన్నీ ఇస్తామని చెప్పి బుట్టలో వేసుకుని ఇప్పుడు నిలువునా ముంచారు. ఇలా విద్యార్థుల నుంచి ఉద్యోగుల వరకు అందరికీ పంగనామాలు పెట్టారు.

భూముల ధారాదత్తం

కూటమి ప్రభుత్వంలో ఒక్క కొత్త ఆతిథ్య రంగ సంస్థ కూడా రాలేదు. మంత్రి నారా లోకేష్ విశాఖను ఐటీ రాజధానిగా చేస్తానని చెప్పారు. దీని పేరు చెప్పి ఊరు పేరు లేని ఉర్సా కంపెనీకి రూ.500 కోట్లు విలువ చేసే 60 ఎకరాల భూములను ధారాదత్తం చేసేశారు. ఐటీ కంపెనీల పేరుతో విశాఖ సంపదను, భూములను దోచి పెడుతున్నారు.

స్టీల్‌ప్లాంట్ కార్మికుల గోడుపట్టదా?



ఉక్కు పరిశ్రమను నిర్వీర్యం చేసేందుకు కేంద్రం నెమ్మదిగా ఉద్యోగులను వీఆర్ఎస్ పేరుతో ఇంటికి పంపిస్తోంది. కాంట్రాక్టు కార్మికులపై వేటు వేసింది. దీంతో వేలాది మంది కాంట్రాక్టు కార్మికుల కుటుంబాలు రోడ్డున పడ్డాయి. గత ఏడాది కాలంగా కార్మికులు రోడ్డెక్కి ఆందోళనలు, ర్యాలీలు, నిరాహార దీక్షలు చేస్తున్నా.. ముఖ్యమంత్రి చంద్రబాబు గానీ, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌గానీ వారి గోడును పట్టించుకున్న దాఖలాలు లేవు. తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోవాలని కార్మికులు నిరసనలు చేపడుతుంటే.. వారి ఆందోళనలను అణిచివేయడానికి పోలీసులను ప్రయోగిస్తుండడం గమనార్హం.

రైతులకు వెన్నుపోటు



కూటమి నేతలు ఎన్నికల ముందు ఇచ్చిన 'అన్నదాత సుఖీభవ' పథకం హామీ అధికారంలోకి వచ్చాక నెరవేర్చలేదు. ఏటా రూ.20,000 రైతులకు అందించకపోవడంపై అన్నదాతలు తీవ్ర నిరాశ వ్యక్తం చేస్తున్నారు. ఇది తమకు వెన్నుపోటు పొడవడమేనని వాపోతున్నారు. పెట్టుబడి సాయం అందకపోగా.. సకాలంలో విత్తనాలు, ఎరువులు సరఫరా చేయడంలో కూడా ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తున్నారు. ఉచిత పంటల బీమాను రద్దు చేసి, ఆ భారాన్ని రైతులపైనే మోపడం, పంటలను రక్షించడానికి సమీక్షలు లేకపోవడం, రైతు భరోసా కేంద్రాలను నిర్వీర్యం చేసి, రైతు సహాయకులను సచివాలయాలకే పరిమితం చేయడం వంటివి రైతుల కష్టాలను మరింత పెంచాయి. కనీస మద్దతు ధర కూడా ఇవ్వలేకపోగా.. ఆక్వా, పాడి రైతులను కూడా ప్రభుత్వం నిట్టనిలువునా ముంచేసింది.



ఆశ వర్కర్ల ఆందోళన (ఫైల్)

రోడ్డున పడ్డ ఉద్యోగులు

కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో వలంటీర్లు, 108 ఉద్యోగులు, అవుట్ సోర్సింగ్ టీచర్లు, ఆశా కార్యకర్తల ధర్నాలు, నిరసనలతో విశాఖ హోరెత్తిపోతోంది. ప్రభుత్వమే వేతనాలు చెల్లించాలని 108 ఉద్యోగులు.. విధుల్లోకి తీసుకొని రూ.10 వేలు వేతనం ఇవ్వాలని వలంటీర్లు.. సమస్యలు పరిష్కరించాలంటూ ఆశ వర్కర్ల నిరసనలు.. ఆకలి కేకలతో అలమటిస్తూ పెండింగ్ జీతాల కోసం ఆయాల పొలికేకలు.. ఎండీయూ వాహనాలు రద్దు చేయడంతో రోడ్డున పడ్డ 702 మంది ఆపరేటర్లు, హెల్పర్ల ఆర్తనాదాలు.. ఇలా చంద్రబాబు ఏడాది పాలనలోనే అన్ని వర్గాల నుంచి అసహనం కట్టలు తెంచుకుంటోంది.

తడబడిన అడుగులు

- నేటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభం
- పూర్తికాని ఉపాధ్యాయుల బదిలీలు
- అసంపూర్తిగా తరగతి గదులు, టాయిలెట్స్ నిర్మాణాలు
- పూర్తిస్థాయిలో రాని స్టూడెంట్స్ కిట్లు
- యూనిఫాం, బూట్లు, సాక్సులు పెండింగ్
- చాలా పాఠశాలల్లో పనిచేయని ఆర్వో ప్లాంట్లు



తోటగరువు హైస్కూల్

ఆరిలోవ: వేసవి సెలవులు పూర్తయ్యాయి. గురువారం నుంచి పాఠశాలలు తెరుచుకోనున్నాయి. ప్రైవేట్ పాఠశాలలు సకల సౌకర్యాలతో విద్యార్థుల తల్లిదండ్రులను రా రమ్మని స్వాగతం పలుకుతుండగా.. సర్కారు బడులు సౌకర్యాల లేమితోనే విద్యార్థులను ఆహ్వానిస్తున్నాయి. జిల్లాలో కొన్ని పాఠశాలల్లో మురుగుదొడ్లు, అదనపు తరగతి గదుల నిర్మాణాలు మధ్యలోనే నిలిచిపోయాయి. పలు పాఠశాలల్లో ఆర్వో ప్లాంట్లు పనిచేయడం లేదు. ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ ఇంకా పూర్తికాలేదు. వీటితో పాటు విద్యార్థులకు పాఠశాలలు తెరిచేనాటికే పంపిణీ చేయాల్సిన సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్లలో(స్టూడెంట్స్ కిట్స్) కొన్ని వస్తువులు కొరత ఉన్నాయి. సాధారణంగా పాఠశాలలు పునఃప్రారంభం నాటికే విద్యాశాఖ అధికారులు అన్ని సిద్ధం చేయాలి. కానీ ఈ విద్యా సంవత్సరం అసౌకర్యాలతో ఆరంభంకానుంది.

స్టూడెంట్స్ కిట్ల కొరత

సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్లలో పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్‌తో పాటు బ్యాగ్, బూట్లు, సాక్సులు, యూనిఫాం, బెల్ట్ ఉండాలి. వాటిలో బ్యాగులు, పాఠ్యపుస్తకాలు కొరతగా ఉన్నాయి. జిల్లాలో 2025–26 విద్యా సంవత్సరానికి ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు 72,627 మంది విద్యార్థులు చదువుతున్నారు. వారిలో 33,830 మంది బాలురు కాగా, 38,697 మంది బాలికలున్నారు. వారందరికి స్టూడెంట్స్ కిట్స్ పంపిణీ చేయాల్సి ఉంది. ఆ కిట్లలో 8,789 స్కూల్ బ్యాగులు కొరతగా పంపించారు. 1,436 పాఠ్య పుస్తకాల కొరత ఉంది. వీటితో పాటు 71,635 మందికి అందించాల్సిన బూట్లు(ఒక జత చొప్పున), సాక్సులు(రెండు జతలు చొప్పున) పూర్తిగా పంపిణీ కాలేదు. బూట్లు, సాక్సులు ఎప్పుడు వస్తాయో విద్యాశాఖాధికారులు వద్ద కూడా స్పష్టత లేకపోవడం విశేషం. ఇంతవరకు ఉన్న కిట్లను మండలాల్లో అన్ని పాఠశాలలకు అధికారులు పంపిణీ చేశారు.

పూర్తికాని ఉపాధ్యాయుల బదిలీ ప్రక్రియ

పాఠశాలలు పునఃప్రారంభానికే ఉపాధ్యాయుల బదిలీలు ప్రక్రియ పూర్తిచేస్తామని విద్యాశాఖాధికారులు ముందుగానే ప్రకటించారు. కానీ ఇప్పటికీ కార్యరూపం దాల్చలేదు. గురువారం పాఠశాలలు తెరుచుకోనున్నాయి. అయినా ఉపాధ్యాయుల బదిలీ ప్రక్రియ సగభాగం కూడా పూర్తికాలేదు. తక్కువ సంఖ్యలో ఉన్న స్కూల్ అసిస్టెంట్లు బదిలీ ప్రక్రియ పూర్తయినప్పటికీ అత్యధిక సంఖ్యలో ఉన్న ఎస్జీటీల బదిలీ ప్రక్రియ మాత్రం ఇంతవరకు ఓ కొలిక్కి రాలేదు. బుధవారం మధ్యాహ్నం నుంచి అర్ధరాత్రి వరకు 300 మందికి మాత్రమే మాన్యువల్ కౌన్సెలింగ్ జరిగింది. జిల్లాలో 2,782 మంది ఎస్జీటీలు కౌన్సెలింగ్‌కు దరఖాస్తు చేసుకొన్నారు. ఎలాంటి సాంకేతిక సమస్యలు తలెత్తకుండా ఉంటే వారందరికీ కౌన్సిలింగ్ పూర్తయ్యేసరికి మరో వారం పడుతుందని అధికారులు అంటున్నారు.

అసంపూర్తిగా మరుగుదొడ్లు, అదనపు తరగతి గదులు

గతంలో అదనపు తరగతి గదులు, మరుగుదొడ్ల నిర్మాణ పనులు పాఠశాలల్లో చేపట్టారు. వాటిలో కొన్ని పాఠశాలల్లో పనులు ఇప్పటికీ అసంపూర్తిగా మిగిలిపోయాయి. దీంతో ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు ఇబ్బందులు ఎదురుకానున్నాయి.



తోటగరువు హైస్కూల్‌లో పాఠ్యపుస్తకాలు

అరకొర ప్రవేశాలు

హైస్కూళ్లలో ఇంతవరకు ప్రవేశాలు జరగలేదు. వేసవి సెలవులు ఇచ్చేనాటికే ప్రవేశాలు జరిపించాలని రాష్ట్ర విద్యాశాఖ హైస్కూళ్ల ప్రధానోపాధ్యాయులను ఆదేశించింది. ఇందులో భాగంగా ఉన్నత పాఠశాలల పరిధిలో ఉన్న ప్రాథమిక పాఠశాలలకు వెళ్లి 2024–25 విద్యా సంవత్సరంలో ఐదో తరగతి చదువుతున్న విద్యార్థులను హైస్కూళ్లలో చేర్పించాలని సూచించింది. అయినా ఇంతవరకు ప్రాథమిక పాఠశాలల విద్యార్థులు ఆరో తరగతిలో చేరలేదు. పునఃప్రారంభం అనంతరం ఆ విద్యార్థులు ఆరో తరగతిలో చేరుతారో లేదో వేచిచూడాల్సిందే. ఇదిలా ఉండగా తరగతి గదిలో విద్యార్థులు, ఉపాధ్యాయుల నిష్పత్తి 49:1గా నిర్ణయించారు. దీంతో హైస్కూల్‌లో అవసరమైన వారి కంటే ఎక్కువమంది ఉపాధ్యాయులు సంఖ్య ఉన్నట్లు లెక్క తేలింది. అదనంగా ఉన్న ఉపాధ్యాయులను ఇప్పుడు వేరేచోటకు బదిలీ చేసేశారు. 2024–25 విద్యా సంవత్సరం వరకు వీరి నిష్పత్తి 40:1గా ఉండేది. తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 40:1గా ఉన్నప్పుడు 57 మంది ఉపాధ్యాయులు ఉండేవారు. ప్రస్తుతం 49:1 నిష్పత్తి ఉండటంతో 16 మంది ఉపాధ్యాయులు తగ్గిపోయారు.

వైఎస్సార్ సీపీలో పలు నియామకాలు

సాక్షి, విశాఖపట్నం: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆ పార్టీ జిల్లా యువజన విభాగంలో 10 మందిని, విద్యార్థి విభాగంలో 13 మందిని నియమించారు. ఈ మేరకు కేంద్ర పార్టీ కార్యాలయం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

- జిల్లా యువజన విభాగం ప్రధాన కార్యదర్శులుగా దేవరకొండ వీరబాబు(విశాఖ పశ్చిమ), రొంగల చంద్రమౌళి(విశాఖ ఉత్తర), గజ్జి లోకేష్ రెడ్డి(విశాఖ ఉత్తర), కార్యదర్శులుగా కర్రి రమేష్(విశాఖ పశ్చిమ), కె.ఎస్ వెంకట సతీష్‌కుమార్(విశాఖ ఉత్తర), ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా వాసు బంగారి రెడ్డి(విశాఖ పశ్చిమ), చీపురుపల్లి రవికిశోర్(విశాఖ పశ్చిమ), పీతల సుధాకర్(విశాఖ పశ్చిమ), బొట్టా రాజు(విశాఖ ఉత్తర), బి.ఎ స్.ఎస్ మూర్తి(విశాఖ ఉత్తర)లను నియమించారు.
- జిల్లా విద్యార్థి విభాగం ఉపాధ్యక్షులుగా నాగిరెడ్డి వినోద్‌కుమార్(విశాఖ పశ్చిమ), జాగా శ్రావణ్‌కుమార్(విశాఖ ఉత్తర), గరికిన వెంకటేష్(విశాఖ పశ్చిమ), ప్రధాన కార్యదర్శులుగా శరగడం జయప్రకాష్(విశాఖ ఉత్తర), షేక్ కశిం వల్లీ(విశాఖ ఉత్తర), కార్యదర్శులుగా బలిజ గణేష్(విశాఖ పశ్చిమ), పొట్నూరి చందన్ సాయి(విశాఖ ఉత్తర), ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా నాగశెట్టి సోము సుందర్ కృష్ణమూర్తి(విశాఖ పశ్చిమ), అబ్దుల్ కరిమ్ ఖాన్(విశాఖ ఉత్తర), పల్లా రామకృష్ణ చైతన్య(విశాఖ ఉత్తర), షేక్ రఫీ(విశాఖ ఉత్తర), కొయిలాడ నిఖిల్(విశాఖ ఉత్తర), మహమ్మద్ సఫ్రాజ్ అలామ్(విశాఖ ఉత్తర) నియమితులయ్యారు.

ఉపాధ్యాయుల సహనానికి పరీక్ష

రెండో రోజూ బదిలీల కౌన్సెలింగ్‌లో గందరగోళం

ఆరిలోవ: ఉమ్మడి విశాఖ జిల్లా ఎస్జీటీ బదిలీల కౌన్సెలింగ్‌లో రెండో రోజూ గందరగోళం నెలకొంది. సాంకేతిక లోపాలు, అధికారుల జాప్యంతో బుధవారం కూడా ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో ఎస్జీటీ బదిలీ కోసం మంగళవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో మాన్యువల్ కౌన్సెలింగ్ ప్రారంభమైన విషయం తెలిసిందే. మొదటి రోజు సాంకేతిక సమస్యలతో అంతా గందరగోళంగా మారింది. దీంతో మొదటి రోజు కౌన్సెలింగ్ పూర్తిగా రద్దు కాగా, రెండో రోజు ఉదయం నుంచి రాత్రి వరకు పడిగాపులు కాయడంతో వారి సహనం నశించి అధికారులను నిలదీశారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం 1 నుంచి 300 వరకు కౌన్సెలింగ్ జరగాల్సి ఉండగా ఉపాధ్యాయులు ఉదయం 10 గంటలకే చేరుకున్నారు. కానీ కౌన్సెలింగ్ ఆలస్యంగా మధ్యాహ్నం 1.30 గంటలకు ప్రారంభమైంది. ప్రక్రియ నత్తనడకన సాగడంతో మధ్యాహ్నం 2.40 గంటలకు కేవలం 20 మందికి, మధ్యాహ్నం 3.30 గంటలకు 50 మందికి, సాయంత్రం 7.45 గంటలకు 210 మందికి మాత్రమే పూర్తయింది. మిగిలిన 90 మంది కౌన్సెలింగ్ ఆలస్యం కావడంతో.. అప్పటి వరకు నిరీక్షించిన ఉపాధ్యాయుల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. వారు ఉమ్మడి జిల్లాల డీఈవోల వద్దకు వెళ్లి, అధికారులు కావాలనే తమను ఇబ్బంది పెడుతున్నారంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు మరోసారి సాంకేతిక సమస్యనే కారణంగా చెప్పినా వారు శాంతించలేదు. చివరకు మిగిలిన వారికి కౌన్సెలింగ్ పూర్తయ్యేసరికి రాత్రి 11 గంటలు దాటింది.



కౌన్సెలింగ్‌కు హాజరైన ఎస్జీటీలు

పాఠశాలల తొలిరోజే టీచర్ల గైర్హాజరు!

మరోవైపు గురువారం పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. నేడు మరో 500 మందికి కౌన్సెలింగ్ నిర్వహిస్తుండటంతో, వారంతా తొలిరోజు పాఠశాలలకు గైర్హాజరు కావడం ఖాయంగా కనిపిస్తోంది. మొదటి రోజు సాంకేతిక లోపంతో కౌన్సెలింగ్ రద్దు కావడం, రెండో రోజు ఈ జాప్యం జరగడంతో ఉపాధ్యాయులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా.. గురువారం 301 నుంచి 800 వరకు ఎస్జీటీ ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తామని విశాఖ డీఈవో ఎన్. ప్రేమ్ కుమార్ తెలిపారు. ఉపాధ్యాయులు ఉదయం 9 గంటలకు కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని ఆయన సూచించారు.

జగన్ కాన్వాయ్‌పై దాడి దుర్మార్గం

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు



సాక్షి, విశాఖపట్నం: పొగాకు రైతుల సమస్యలు తెలుసుకోవడానికి పొదిలి పర్యటనకు వెళ్లిన మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కాన్వాయ్‌పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు అన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తి చూపుతూ, రైతులకు అండగా నిలుస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఏదో విధంగా అడ్డుతొలగించుకోవాలని దాడులు చేస్తున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో మహిళలకు రక్షణ లేదు.. నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు లేవు.. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నింటినీ విస్మరించి అన్ని వర్గాల వారినీ మోసం చేస్తున్న చంద్రబాబు సర్కార్ వైఫల్యాలను ఎత్తి చూపితే తప్పా? అంటూ ప్రశ్నించారు. ప్రజా సమస్యలను, వారికిచ్చిన హామీలను గాలికొదిలేసి చంద్రబాబు, పవన్ కల్యాణ్ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ఆరోపించారు. ఇచ్చిన హామీలు అమలు చేయలేక ఏదో విధంగా అలజడులు సృష్టించి, తద్వారా శాంతిభద్రతలకు ఆటంకం కలిగించడం, ఆ నెపాన్ని జగన్‌మోహన్‌రెడ్డిపై, వైఎస్సార్‌సీపీపై వేయాలనే కుట్రలు, కుతంత్రాలు జరుగుతున్నాయన్నారు. అందుకు నిదర్శనమే పొదిలి పర్యటనలో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కాన్వాయ్‌పై జరిగిన దాడి అని కె.కె.రాజు అన్నారు.

రేపు సీఎం చంద్రబాబు రాక

బీచ్‌రోడ్డు: ముఖ్యమంత్రి చంద్రబాబు శుక్రవారం నగరానికి రానున్నారు. విజయవాడ నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరి ఉదయం 11 గంటలకు విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడ నుంచి రోడ్డు మార్గం ద్వారా నోవాటెల్‌కు చేరుకుంటారు. 11.30 నుంచి 1 గంట వరకు హోటల్‌లో జరిగే ప్రాంతీయ సదస్సులో పాల్గొంటారు. అనంతరం కాసేపు విశ్రాంతి తీసుకుకొని మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు అంతర్జాతీయ యోగా దినోత్సవ ఏర్పాట్లపై సమీక్షిస్తారు. అక్కడ నుంచి రోడ్డు మార్గం ద్వారా సిరిపురం చేరుకుని డెక్ భవనం ప్రారంభిస్తారు. వీఎంఆర్డీఏ చిల్డ్రన్ ఎరీనాలో ఏర్పాటు చేసిన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారు. అక్కడ నుంచి రోడ్డు మార్గం ద్వారా సాయంత్రం 6.30 గంటలకు విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకొని ప్రత్యేక విమానంలో తిరిగి ప్రయాణం అవుతారు.

పునరుత్పాదక శక్తిపై వర్క్‌షాప్ రేపు

విశాఖ సిటీ: మినిస్ట్రీ ఆఫ్ న్యూ అండ్ రెన్యువబుల్ ఎనర్జీ(ఎంఎన్ఆర్ఈ) ఆధ్వర్యంలో ఈ నెల 13న నోవాటెల్ హోటల్‌లో సౌత్ జోన్ రీజనల్ వర్క్‌షాప్‌ను నిర్వహించనున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీఎం చంద్రబాబుతో పాటు కేంద్ర మంత్రి ప్రహ్లాద్ వెంకటేష్ జోషి హాజరుకానున్నారు. రాష్ట్రం తరఫున విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, నెడ్‌క్యాప్ వీసీ–ఎండీ కమలాకర్‌బాబు, ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి, ఏపీఎస్‌పీడీసీఎల్ సీఎండీ కె.సంతోషరావు, ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పి.పుల్లారెడ్డి, పలు రాష్ట్రాల విద్యుత్ శాఖ మంత్రులు పాల్గొననున్నారు. ఈ వర్క్‌షాప్‌లో ప్రధానంగా పీఎం సూర్యఘర్, పీఎం కుసుమ్ తదితర ప్రభుత్వ పథకాల అమలు తీరు, విండ్ ఎనర్జీ, సోలార్ ఎనర్జీ, హైడ్రో పవర్ వంటి పునరుత్పాదక ఇంధన వనరుల ఆవశ్యకతపై చర్చించనున్నారు.

కేకే లైన్‌లో రైళ్ల గమ్యం కుదింపు

తాటిచెట్లపాలెం: కె.కె.లైన్‌లోని సుకు–కోరాపుట్ మధ్య జరుగుతున్న రెండవ లైన్ పనుల కారణంగా ఆ మార్గంలో నడిచే పలు రైళ్ల గమ్యం కుదించినట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. ఈ నెల 13, 16వ తేదీల్లో విశాఖపట్నం–కోరాపుట్(18512) బై వీక్లీ ఎక్స్‌ప్రెస్ దుమురిపుట్ వరకు మాత్రమే నడుస్తుంది. ఈ నెల 14, 17వ తేదీల్లో కోరాపుట్–విశాఖపట్నం(18511) బై వీక్లీ ఎక్స్‌ప్రెస్ దుమురిపుట్ నుంచి బయలుదేరుతుంది. ఈ తేదీల్లో దుమురిపుట్–కోరాపుట్ మధ్య ఈ రైలు రాకపోకలు సాగించదు.

- ఈ నెల 12 నుంచి 19వ తేదీ వరకు విశాఖపట్నం–కోరాపుట్(58538) పాసింజర్ దమన్‌జోడి వరకు మాత్రమే నడుస్తుంది. ఈ నెల 13 నుంచి 20వ తేదీ వరకు కోరాపుట్–విశాఖపట్నం(58537) పాసింజర్ దమన్‌జోడి నుంచి బయలుదేరుతుంది. ఈ తేదీల్లో ఈ రైలు కోరాపుట్–దమనజోడి మధ్య రాకపోకలు సాగించదని రైల్వే అధికారులు తెలిపారు.

తహసీల్దార్లు విధుల్లో చేరికపై సందిగ్ధం

మహారాణిపేట: అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి విశాఖపట్నం జిల్లాకు బదిలీ అయిన ఇద్దరు తహసీల్దార్లు విధుల్లో చేరికపై సందిగ్ధం నెలకొంది. ఇటీవల బదిలీ అయిన రామకృష్ణ (పెందుర్తి తహసీల్దార్‌గా), ఎంవీవీ ప్రసాద్ (కలెక్టరేట్‌లో సి.సెక్షన్ పర్యవేక్షకుడిగా) ఇంకా విధుల్లో చేరలేదు. విశ్వసనీయ సమాచారం ప్రకారం రామకృష్ణను అల్లూరి జిల్లా కలెక్టర్ రిలీవ్ చేయడానికి నిరాకరిస్తున్నట్లు తెలుస్తోంది. అలాగే ప్రసాద్ తనకు తహసీల్దార్ పోస్ట్ కేటాయిస్తేనే వస్తానని చెబుతున్నట్లు సమాచారం. ఈ కారణాలతో ఇద్దరు అధికారులు ఇంకా రిలీవ్ కాలేదని తెలుస్తోంది.

సమాచార శాఖ డీడీగా సదారావు

మహారాణిపేట: సమాచార శాఖ డిప్యూటీ డైరెక్టర్(డీడీ)గా సదారావు నియమితులయ్యారు. నెల్లూరు జిల్లాలో డిప్యూటీ డైరెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఆయన బదిలీపై ఇక్కడకు వస్తున్నారు. ఇక్కడ చాలా రోజుల నుంచి డీడీ పోస్టు ఖాళీగా ఉంది. అలాగే విజయనగరం జిల్లాలో అసిస్టెంట్ డైరెక్టర్(ఏడీ)గా పనిచేస్తున్న డి.రమేష్‌ను విశాఖ జిల్లా ఏడీగా నియమించారు. ఈ పోస్టు కూడా చాలా రోజుల నుంచి ఖాళీగా ఉంది. విశాఖ జిల్లా డీపీఆర్వో సీహెచ్ రమణను అనకాపల్లి జిల్లా డీపీఆర్వోగా ప్రభుత్వం బదిలీ చేసింది.

పాఠశాలలు, హాస్టళ్లకు సన్న బియ్యం

మహారాణిపేట: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా సన్న బియ్యంతో పౌష్టికాహారం అందిస్తామని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని మిల్లింగ్ చేసి సన్న బియ్యాన్ని సిద్ధం చేశామని, గురువారం నుంచి జిల్లాలోని మొత్తం 582 ప్రభుత్వ పాఠశాలలు, 70 సంక్షేమ హాస్టళ్లలో వినియోగిస్తామని పేర్కొన్నారు. ఈ బియ్యాన్ని 25 కిలోల ప్యాకెట్ల రూపంలో ప్యాక్ చేసి, క్యూఆర్ కోడ్ స్కానింగ్ ద్వారా మండల స్థాయి గోదాములకు చేరవేశారు. అక్కడి నుంచి నేరుగా అన్ని ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లకు అవసరమైన ప్యాకెట్లను సరఫరా చేసినట్లు చెప్పారు. పిల్లలకు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని జేసీ వెల్లడించారు.

ఐసీడీఎస్ అర్బన్ సీడీపీవోగా నీలిమ

మద్దిలపాలెం: ఐసీడీఎస్ విశాఖ అర్బన్ సీడీపీవోగా కె.నీలిమ నియమితులయ్యారు. ఈ మేరకు ఆర్అండ్‌బీ జంక్షన్ సమీపంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో బుధవారం ఆమె బాధ్యతలు స్వీకరించారు. అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి కృషి చేస్తానని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది ఆమెకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఇక్కడ సీడీపీవోగా విధులు నిర్వర్తిస్తున్న రమణకుమారి యలమంచిలికి బదిలీ అయిన సంగతి తెలిసిందే..


సీడీపీవో నీలిమ

దైవ దర్శనానికి వెళ్లొస్తూ..

- స్కూటీ బ్రేకులు ఫెయిల్.. తల్లి మృతి.. తండ్రికి సీరియస్
- అనాథలైన పసిపాపలు
- పూర్ణామార్కెట్ సమీపంలోని ఘాట్ రోడ్డులో ఘటన


కృష్ణకుమారి (ఫైల్)


ఘటనా స్థలంలో మరణించిన కృష్ణకుమారి,గాయాలతో చిలుకునాయుడు


ప్రమాదం నుంచి బయటపడిన చిన్నారి హాత్విక

జగదాంబ/బుచ్చెయ్యపేట: భార్య వైద్య పరీక్షల కోసం కేజీహెచ్‌కు బయలుదేరిన ఆ కుటుంబం.. గమ్యం చేరకముందే ప్రమాదం బారిన పడింది. ఇసుకకొండ సత్యనారాయణ స్వామి దర్శనం అనంతరం తిరిగి వస్తుండగా రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు వెంటాడటంతో.. భార్య అక్కడికక్కడే కన్నుమూయగా, భర్త పరిస్థితి విషమంగా ఉంది. కన్నవారి కోసం ఆ పసిపిల్లల ఎదురుచూపులు, వారి ఆలనా పాలనా చూడాల్సిన నాన్నమ్మ గుండెలవిసేలా రోదించడం గ్రామస్తులను కంటతడి పెట్టించింది. ఈ ఘటనతో బుచ్చెయ్యపేట మండలం ఆర్.శివరాంపురంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

దేవర చిలుకునాయుడు దివ్యాంగుడు. కాళ్లు చచ్చుబడ్డా.. ఆత్మవిశ్వాసాన్ని చంపుకోలేదు. ఎనిమిదేళ్ల కిందట దిబ్బిపాలేనికి చెందిన కృష్ణకుమారి (33)ని వివాహం చేసుకున్నాడు. గ్రామంలో చిన్న పాన్‌షాపు పెట్టుకుని జీవనం సాగిస్తున్న చిలుకనాయుడికి భార్యే చేదోడు వాదోడుగా ఉండేది. వారికి ఇద్దరు కుమార్తెలు యువశ్రీ(4), హాత్విక(8 నెలలు) ఉన్నారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న కృష్ణకుమారిని ప్రతి నెలా కేజీహెచ్‌కు తీసుకొస్తున్నాడు చిలుకునాయుడు. బుధవారం ఉదయం కూడా తన మూడు చక్రాల స్కూటీపై భార్య, చిన్న కూతురు హాత్వికతో కలిసి శివరాంపురం నుంచి బయలుదేరాడు. ఈ క్రమంలో వీరు సత్యనారాయణ స్వామి దర్శనానికి ఘాట్ రోడ్డులో వెళ్లి తిరిగి వస్తున్నారు. పూర్ణామార్కెట్ సమీపంలో మొదటి మలుపు వద్ద స్కూటీ బ్రేకులు ఫెయిల్ అయ్యాయి. అదుపుతప్పిన వాహనం వేగంగా గోడను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కృష్ణకుమారి తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే ప్రాణాలు విడిచింది. చిలుకునాయుడు తీవ్ర రక్తస్రావంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. స్కూటీలో ముందు కూర్చున్న 8 నెలల హాత్విక పక్కనే ఉన్న ఇసుక దిబ్బపై పడటంతో ప్రాణాలతో బయటపడింది.ఆ పసిపాప ఏడుపు విని చలించిపోయిన ఓ మహిళా వ్యాపారి, చిన్నారిని దగ్గరకు తీసుకుని సపర్యలు చేసింది. అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించింది. ప్రస్తుతం కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న చిలుకునాయుడు పరిస్థితి విషమంగా ఉందని, 24 గంటలు గడిస్తే కానీ ఏమీ చెప్పలేమని వైద్యులు తెలిపారు.

గుండెలు పగిలేలా రోదన

చిలుకునాయుడు తండ్రి చిన్నోడు గతంలోనే మరణించారు. కొడుకు చిలుకనాయుడే తల్లి రాజులమ్మకు ఆధారం. ఇప్పుడు కోడలు మరణించి, కొడుకు ప్రాణాలతో కొట్టుమిట్టాడుతుండటంతో ఆ తల్లి గుండె పగిలింది. 'నా కొడుకు బతకాలి.. ఈ పసిపిల్లల్ని ఎలా సాకాలి? రేపటి నుంచి మా బతుకులేంటి?' అంటూ ఆమె నేలపై పడి రోదించిన తీరు అక్కడి వారందరినీ కదిలించింది. తల్లి చనిపోయిందని, తండ్రి ఆసుపత్రిలో ఉన్నాడని తెలియని ఆ ఇద్దరు పసిపిల్లలు బిక్కుబిక్కుమంటూ ఎదురుచూస్తుండటం చూపరులను కలిచివేసింది. చితికిపోయిన ఈ కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు.

అప్పన్నకు మూడో విడత చందనం సమర్పణ

సింహాచలం: జ్యేష్ఠ పౌర్ణమిని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మూడో విడత చందనం సమర్పణ బుధవారం శాస్త్రోక్తంగా జరిగింది. పాంచరాత్ర ఆగమశాస్త్రాన్ని అనుసరించి ఆలయ అర్చకులు ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున స్వామికి సుప్రభాత సేవ అనంతరం మూడు మణుగుల(సుమారు 125 కిలోలు) పచ్చి చందనాన్ని స్వామికి సమర్పించారు. అనంతరం విశేష పూజలు నిర్వహించారు. తదుపరి స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ ఆస్థానమండపంలో వేంజేపచేసి జ్యేష్ఠాభిషేకాన్ని ఘనంగా జరిపారు. గంగధార జలాలు, పంచామృతాలతో పంచకలశ స్నపనాన్ని నిర్వహించారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఏయూలో కొలువుదీరిన కొత్త నాయకత్వం


డీన్‌లు, డైరెక్టర్లు, అసోసియేట్ డైరెక్టర్ల నియామక ఉత్తర్వులు అందిస్తున్న వీసీ ఆచార్య రాజశేఖర్, రిజిస్ట్రార్ ఆచార్య ధనుంజయరావు

మద్దిలపాలెం: ఆంధ్ర విశ్వవిద్యాలయం విభాగాలకు నూతన నాయకత్వం పదవీ బాధ్యతలు చేపట్టింది. ఏయూ అకడమిక్ సెనేట్ మందిరంలో ఉపకులపతి ఆచార్య జి.పి.రాజశేఖర్, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనంజయరావు చేతుల మీదుగా డీన్, డైరెక్టర్, అసోసియేట్ డైరెక్టర్లకు బుధవారం నియామక ఉత్తర్వులను అందించారు. మొత్తం 43 మందికి వివిధ పదవీ బాధ్యతలను కేటాయించారు. అనంతరం వీసీ రాజశేఖర్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో శతాబ్ది ఉత్సవాలను ప్రారంభించామని, త్వరలో నూతన కార్యక్రమాలను చేపట్టేలా ప్రతి విభాగం పనిచేయాలన్నారు. విద్యార్థులతో, సిబ్బందితో గౌరవప్రదంగా నడుచుకోవాలన్నారు.

యువతకు ప్రాధాన్యత

నూతనంగా నియామకం చేసిన డీన్, డైరెక్టర్, అసోసియేట్ డైరెక్టర్లలో అత్యధికంగా యువతకు అవకాశం కల్పించారు. ప్రతి విభాగంలో ఉన్న యువ ఆచార్యులను ఎంపిక చేసి ఈ బాధ్యతలు కేటాయించారు. భవిష్యత్ నాయకత్వాన్ని ప్రోత్సహిస్తూ వర్సిటీని ముందుకు నడిపించే దిశగా యువ ఆచార్యులను ప్రోత్సహించేందుకు ఈ నిర్ణయాన్ని తీసుకున్నారు.

ప్లంబింగ్‌లో ఉచిత శిక్షణ

మహారాణిపేట: అర్హులైన నిరుద్యోగ యువతకు అసిస్టెంట్ ప్లంబింగ్ జనరల్ కోర్సులో ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ ఇవ్వనున్నట్లు నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్(నేక్) అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్‌వీఎస్ఎస్ రవికుమార్ తెలిపారు. టెన్త్ పాస్/ఫెయిల్ అయిన 15 నుంచి 44 ఏళ్ల మధ్య వయసున్న వారికి రెండు నెలలు శిక్షణ అందిస్తామన్నారు. శిక్షణ అనంతరం సంబంధిత రంగాల్లో ప్రైవేట్ సంస్థల్లో ఉపాధి కల్పిస్తామన్నారు. వివరాలకు 85005 02395, 98668 83199 నంబర్లలో సంప్రదించాలన్నారు.

రేపటి నుంచి సీజీఆర్ఎఫ్ సదస్సులు


సత్యనారాయణ, సీజీఆర్ఎఫ్ చైర్‌పర్సన్

విశాఖ సిటీ: ఏపీఈపీడీసీఎల్ పరిధిలో విశాఖ జోన్–2, బొబ్బిలి, జగ్గంపేట డివిజన్ల విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం సదస్సులు నిర్వహించనున్నట్లు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (సీజీఆర్ఎఫ్) చైర్‌పర్సన్, విశ్రాంతి జడ్జి బి.సత్యనారాయణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 13న విశాఖ సర్కిల్ జోన్–2 డివిజన్ (పెదగంట్యాడ సెక్షన్), 17న విజయనగరం సర్కిల్ బొబ్బిలి డివిజన్(మెంటాడ సెక్షన్), 19న కాకినాడ సర్కిల్ జగ్గంపేట డివిజన్(హంసవరం సెక్షన్) కార్యాలయాల్లో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు ఈ సదస్సులు జరుగుతాయని తెలిపారు. వినియోగదారులు నేరుగా పాల్గొని విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, హెచ్చు తగ్గులు, బిల్లుల సమస్యలు, కొత్త సర్వీసుల జారీలో జాప్యం, పేరుమార్పిడి, విద్యుత్ సరఫరా పునరుద్ధరణలో జాప్యం, ట్రాన్స్ ఫార్మర్ల మార్పిడి, తదితర విద్యుత్ సంబంధిత సమస్యలపై ఫిర్యాదులను తెలపాలని సూచించారు. అలాగే సీతమ్మధారలోని ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో ఉన్న సీజీఆర్ఎఫ్ కార్యాలయానికి కూడా లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చన్నారు. వినియోగదారుల సమస్యల వివరాలను పరిశీలించి, విచారణ జరిపి తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. వినియోగదారులు విద్యుత్ సంబంధిత సమస్యల పరిష్కారం కోసం టోల్ ఫ్రీ నెంబర్ 1912కు సంప్రదించాలని సూచించారు. ఈ సదస్సుల్లో తనతో పాటు సీజీఆర్ఎఫ్ కమిటీ సభ్యులు బి.సులేఖరాణి, ఎస్.సుబ్బారావు, ఎస్.మురళీకృష్ణ పాల్గొంటారన్నారు.

విశాఖలో తాత్కాలిక రెడ్ జోన్

- ప్రధాని పర్యటనకు భారీ భద్రత
- 17 నుంచి 21 వరకు కోస్టల్ బ్యాటరీ నుంచి పార్క్ హోటల్ వరకు నో డ్రోన్ జోన్

విశాఖ సిటీ: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విశాఖ పర్యటన సందర్భంగా పోలీస్ శాఖ పటిష్ట భద్రతా చర్యలు చేపడుతోంది. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఈ నెల 21వ తేదీన విశాఖలో ఘనంగా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు పీఎం విశాఖ రానున్నారు. ఈ సందర్భంగా భారీ బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఈ నెల 17వ తేదీ ఉదయం 10 నుంచి 21వ తేదీ ఉదయం 10 గంటల వరకు నేవల్ కోస్టల్ బ్యాటరీ నుంచి పార్క్ హోటల్ మధ్య తాత్కాలిక రెడ్ జోన్‌ను విధించారు. అలాగే ఆ ప్రాంతాన్ని నో డ్రోన్ జోన్‌గా ప్రకటించారు. ఆయా తేదీల్లో ఆ ప్రాంతానికి 5 కిలోమీటర్ల పరిధిలో డ్రోన్లను ఎగరవేయడాన్ని నిషేధించారు. ఎవరైనా అతిక్రమిస్తే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి హెచ్చరించారు.

అంతర్ రాష్ట్ర మహిళల బ్లైండ్ క్రికెట్ విజేత ఒడిశా

రన్నరప్‌గా ఆంధ్రప్రదేశ్ జట్టు


రన్నరప్ ఆంధ్రప్రదేశ్ జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న అతిథులు


విజేత జట్టు ఒడిశాకు ట్రోఫీ అందజేస్తున్న ఎన్టీపీసీ జీఎం సమీర్‌శర్మ, హెచ్ఆర్

ఉక్కునగరం: ఉక్కు స్టేడియంలో జరిగిన అంతర్ రాష్ట్ర మహిళల బ్లైండ్ క్రికెట్ చాంపియన్‌షిప్‌ను ఒడిశా జట్టు కైవసం చేసుకుంది. ఎన్టీపీసీ సింహాద్రి సహకారంతో క్రికెట్ అసోసియేషన్ ఫర్ ది బ్లైండ్ ఆంధ్రప్రదేశ్ (సీఏబీఏపీ), క్రికెట్ అసోసియేషన్ ఫర్ ది బ్లైండ్ కేరళ (సీఏబీకే) సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన టోర్నమెంట్‌లో ఢిల్లీ, ఒడిశా, కేరళ, ఆంధ్రప్రదేశ్ జట్లు పాల్గొన్నాయి. బుధవారం జరిగిన ఫైనల్స్‌లో ఒడిశా జట్టు మొదట బ్యాటింగ్‌కు దిగింది. 15 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 109 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన ఆంధ్రప్రదేశ్ జట్టు 15 ఓవర్లలో 80 పరుగులకే ఆలౌట్ అయింది. దీంతో ఒడిశా జట్టు విజేతగా నిలిచింది. ఫైనల్ మ్యాచ్‌కు డిప్యూటీ మేయర్ దల్లి గోవింద రెడ్డి హాజరై క్రీడాకారులను అభినందించారు. ముగింపు కార్యక్రమంలో ఎన్టీపీసీ ఈడీ సమీర్ శర్మ, హెచ్ఆర్ బి.బి.శర్మ ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు ట్రోఫీలు, బహుమతులు అందజేశారు. ఇండియన్ బ్లైండ్ క్రికెట్ మాజీ కెప్టెన్ అజయ్‌కుమార్ రెడ్డి, కో–ఆర్డినేటర్లు అమ్మి నాయుడు, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మి హుండీ ఆదాయం రూ.53.29 లక్షలు


హుండీల ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

డాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి హుండీల ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. మార్చి 27 నుంచి ఈ నెల 11వ తేదీ వరకు రూ.53,29,489 నగదు, 59 గ్రాముల బంగారం, 990 గ్రాముల వెండి లభించింది. అలాగే యూఎస్ఏకి చెందిన 32 డాలర్లు, కువైట్‌కు చెందిన 1/4 దినర్, 5 రూపీస్ నేపాల్ కరెన్సీ, శ్రీలంకకు చెందిన 100 రుపీస్, ఇంగ్లండ్‌కు చెందిన 5 యూరోస్, హాంగ్ కాంగ్ కరెన్సీ 20 డాలర్లు, సింగపూర్ కరెన్సీ 10 డాలర్లు, అరబ్ ఎమిరేట్స్ 5 దిరమ్స్ వచ్చాయి. హుండీ లెక్కింపులో ఆలయ ఈవో కె.శోభారాణి, వెలంపేట దుర్గాలమ్మ ఆలయ ఈవో పి.శేఖర్ బాబు, ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వరరావు, గోపాలపట్నం శ్రీ హరి సేవ సభ్యులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు ఆర్టీసీ ఉద్యోగుల సమ్మె నోటీస్


కలెక్టర్‌కు సమ్మె నోటీస్ అందజేస్తున్న ఎన్ఎంయూఏ నాయకులు

మద్దిలపాలెం: విజయనగరం జోన్ వ్యాప్తంగా ఉన్న సమస్యల పరిష్కారంలో యాజమాన్యం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా.. కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్‌కు బుధవారం సమ్మెకు సంబంధించిన నోటీసు అందజేసినట్లు నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి పి.వి.మోహన్ తెలిపారు. ఈ నెల 8న జరిగిన జోనల్ కౌన్సిల్ సమావేశంలో యాజమాన్యం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాల వల్ల కార్మికులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని.. జోన్‌లోని అన్ని జిల్లాల కలెక్టర్లకు సమ్మె నోటీసులు ఇవ్వాలని తీర్మానం చేశారన్నారు. ఈ నెల 26వ తేదీ తర్వాత ఎప్పుడైనా సమ్మెలోకి వెళ్లే అవకాశం ఉందని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు కలెక్టర్‌కు సమ్మె నోటీస్ మెమోరాండంను సమర్పించామన్నారు. రాష్ట్ర కార్యదర్శి జి.ఆర్.రావు, జిల్లా కార్యదర్శి పిళ్లా శంకర్‌రావు, జిల్లా అధ్యక్షుడు పి.ఎస్.మూర్తి, విజయనగరం మాజీ జోనల్ కార్యదర్శి ఎం.వి.ఆర్.మూర్తితో పాటు జోనల్‌లోని ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

హైదరాబాద్–కటక్ మధ్య ప్రత్యేక రైలు పొడిగింపు

తాటిచెట్లపాలెం: హైదరాబాద్– కటక్–హైదరాబాద్(వయా దువ్వాడ మీదుగా) మధ్య నడుస్తున్న ప్రత్యేక రైలును మరికొంతకాలం పొడిగించినట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. హైదరాబాద్–కటక్(07165) స్పెషల్ హైదరాబాద్‌లో ఈ నెల 17, 24వ తేదీల్లో రాత్రి 8.10 గంటలకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 9.05 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 9.07 గంటలకు బయలుదేరి అదేరోజు సాయంత్రం 5.45 గంటలకు కటక్ వెళ్తుంది. కటక్–హైదరాబాద్(07166) స్పెషల్ కటక్‌లో ఈ నెల 18, 25వ తేదీల్లో రాత్రి 10.30 గంటలకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 7.35 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 7.37 గంటలకు బయలుదేరి అదే రోజు రాత్రి 9 గంటలకు హైదరాబాద్ వెళ్తుంది.

రైల్వే కో–ఆపరేటివ్ సొసైటీ ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు

తాటిచెట్లపాలెం: సౌత్ ఈస్ట్, సౌత్ ఈస్ట్ సెంట్రల్, ఈస్ట్‌కోస్ట్ రైల్వే ఎంప్లాయీస్ కో–ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ (రైల్వే కో–ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్)లో పూర్వ ప్యానెల్ డైరెక్టర్లు నియమించిన పలువురు ఉద్యోగులకు ప్రస్తుత చైర్‌పర్సన్ ఎస్.పి.సింగ్ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈ మేరకు సొసైటీ చైర్‌పర్సన్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గత పాలకవర్గం హయాంలో బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు ఎటువంటి నోటిఫికేషన్ లేకుండానే తమ కుటుంబ సభ్యులను సొసైటీలో సభ్యులుగా నియమించినట్లు గుర్తించారు. అంతేకాకుండా వారు ఉద్యోగాలు చేయకపోయినా సొసైటీ నిధుల నుంచి వారికి నెలనెలా జీతభత్యాలు చెల్లించినట్లు ఆరోపణలు ఉన్నాయి. వాస్తవానికి అప్పటికే ఈ పాలకమండలి కాలపరిమితి పూర్తయి, దానిని డిబార్ చేయడం జరిగింది. అయినప్పటికీ వారు నిబంధనలను అతిక్రమించి కొన్నేళ్లుగా ఈ విధంగా చేస్తున్నారని చైర్‌పర్సన్ తెలిపారు. ఈ అక్రమాలపై ఎందుకు చర్యలు తీసుకోకూడదో వివరణ ఇవ్వాల్సిందిగా వారికి నోటీసులు జారీ అయ్యాయి.

స్టూడెంట్ బస్సు పాసుల జారీకి చర్యలు

డాబాగార్డెన్స్: ఈ నెలలో విద్యా సంస్థలు ప్రారంభం కానున్న దృష్ట్యా విద్యార్థులకు బస్సు పాసుల జారీకి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు జిల్లా ప్రజా రవాణా అధికారి బి.అప్పలనాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బస్‌పాస్ అప్లికేషన్ ఆధునీకీకరించనున్న కారణంగా గురువారం బస్ పాస్ కౌంటర్లకు సెలవు ప్రకటించామని, 13వ తేదీ నుంచి బస్సుపాసులు యథావిధిగా జారీ చేయనున్నట్టు తెలిపారు. సిటీ పరిధిలో ద్వారకా బస్ స్టేషన్, మద్దిలపాలెం, సింహాచలం, గాజువాక, ఎంవీపీ బస్ స్టేషన్, మధురవాడ, పెందుర్తి, కూర్మన్నపాలెం స్టేషన్లలో బస్‌పాస్ కౌంటర్లు ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు పనిచేస్తాయని పేర్కొన్నారు.

విద్యార్థులకు సూచనలు

- https://buspassonline.apsrtconline.in/లో వివరాలు, ఫొటో నమోదు చేసుకుని, దరఖాస్తు ఫారం ప్రింట్ తీసుకోవాలి.
- దరఖాస్తుపై విద్యా సంస్థ ప్రిన్సిపాల్/హెచ్ఎంచే ధృవీకరణ చేయించి, సంబంధిత డిపో కార్యాలయానికి వెళ్లాలి.
- దరఖాస్తుకు ఆధార్, 10వ తరగతి మా ర్క్‌లిస్ట్ జెరాక్స్ కాపీ తప్పనిసరిగా జతపరచాలి. దరఖాస్తులో విద్యార్థి ఫోన్ నంబరు తప్పక రాయాలి.

విద్యా సంస్థలకు సూచనలు

- అడ్మిషన్ లిస్టు తరగతుల వారీగా ప్రిన్సిపాల్/ప్రధానోపాధ్యాయుడు సంతకంతో సంబంధిత డిపో మేనేజర్ కార్యాలయానికి అందజేయాలి.
- 12 ఏళ్లలోపు బాలురు, 18 ఏళ్లలోపు బాలికలు(10వ తరగతి వరకు) ఉచిత బస్సుపాస్ పొందవచ్చు. అలాగే స్టూడెంట్ జనరల్ బస్ పాస్(ఇయర్లీ), స్టూడెంట్ జనరల్ బస్‌పాస్(క్వార్టర్లీ), స్టూడెంట్ జనరల్ బస్‌పాస్(నెలవారీ), స్టూడెంట్ గ్రేటర్ విశాఖ పాస్, స్టూడెంట్ రూట్ పాస్, జేటీసీ పాసు కోసం విద్యార్థులు సంబంధిత డిపోలకు వెళ్లి దరఖాస్తు వెరిఫికేషన్ చేయించుకొని బస్‌పాస్ పొందవచ్చు.

జర్నలిస్టులకు ఉచిత వైద్య పరీక్షలు


కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న జర్నలిస్ట్ సంఘాల ప్రతినిధులు

మహారాణిపేట: జిల్లాకు చెందిన వర్కింగ్ జర్నలిస్టులకు త్వరలో ఉచిత వైద్య పరీక్షలు నిర్వహిస్తామని కలెక్టర్ హరేంద్ర ప్రసాద్ హామీ ఇచ్చినట్లు జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (ఏపీడబ్ల్యూజేఎఫ్) ఇచ్చిన రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా బుధవారం కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్‌ను కలిసి, పెండింగ్‌లో ఉన్న 12 అంశాలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ ఏటా మాదిరిగానే వర్కింగ్ జర్నలిస్టులకు వైద్య పరీక్షలు చేయించాలని కోరారు. దీనికి కలెక్టర్ స్పందించి, ఈ నెల 21న జరగనున్న 'యోగాంధ్ర'పూర్తయిన తర్వాత దీనిపై నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. జర్నలిస్టుల ఇంటి స్థలాల సమస్యను పరిష్కరించాలని, మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని, పెన్షన్ సదుపాయం కల్పించాలని కలెక్టర్‌ను కోరారు. ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు పోతుమహంతి నారాయణ్ మాట్లాడుతూ జర్నలిస్టులపై దాడులను అరికట్టేందుకు వీలుగా రాష్ట్రంలో హై పవర్ కమిటీ, జిల్లాలో పోలీసు ఉన్నతాధికారులతో కమిటీలను ఏర్పాటు చేసి భద్రత కల్పించాలన్నారు. ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి జి.శ్రీనివాస్, ఏపీ బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు ఇరోతి ఈశ్వరరావు, చింతాడ మదన్, ఆంధ్రప్రదేశ్ స్మాల్ అండ్ మీడియం పేపర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వి.ఎస్.జగన్ మోహన్‌రావుతో పాటు ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇద్దరు ఉక్కు ఉద్యోగులకు గాయాలు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లోని ఈడీ (వర్క్స్) బిల్డింగ్ ఎదురుగా ఉన్న మిల్స్ కూడలి వద్ద బుధవారం తెల్లవారుజామున జరిగిన ప్రమాదంలో ఇద్దరు ఉద్యోగులు గాయపడ్డారు. సీఐఎస్ఎఫ్ వాహనం ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టడంతో ఈ ఘటన జరిగింది. ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు వివరాలివి. వడ్లపూడి ప్రాంతానికి చెందిన సీరాపు సత్తిబాబు, నెమలికంటి రామారావు స్టీల్‌ప్లాంట్‌లోని వైర్ రాడ్ మిల్ విభాగంలో విధులు నిర్వర్తిస్తున్నారు. ఉదయం 'ఏ'షిఫ్ట్ విధులకు హాజరయ్యేందుకు వారిద్దరూ ద్విచక్రవాహనంపై బయలుదేరారు. మిల్స్ కూడలి వద్ద మలుపు తిరుగుతుండగా అదే సమయంలో సెంట్రల్ స్టోర్స్ జంక్షన్ వైపు నుంచి వేగంగా వస్తున్న సీఐఎస్ఎఫ్ వాహనం వారి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరికీ గాయాలయ్యాయి. సత్తిబాబు పరిస్థితి విషమంగా ఉండటంతో అతన్ని నగరంలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. రామారావుకు ఉక్కు ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. స్టీల్‌ప్లాంట్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్ల పరిశీలన

మహారాణిపేట: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ నెల 13వ తేదీన విశాఖలో పర్యటించనున్న నేపథ్యంలో సంబంధిత ఏర్పాట్లను కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ పరిశీలించారు. నోవోటెల్, వీఎంఆర్డీఏ డెక్ భవనం, వీఎంఆర్డీఏ చిల్డ్రన్ ఎరీనాను పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, వీఎంఆర్డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్, డీసీపీ అజిత, ఇతర అధికారులతో కలిసి బుధవారం సందర్శించిన ఆయన అక్కడ పరిస్థితులను గమనించారు. ఆ రోజు ఉదయం మినిస్ట్రీ ఆఫ్ న్యూ అండ్ రెన్యువబుల్ ఎనర్జీ (ఎంఎన్ఆర్ఈ) ఆధ్వర్యంలో నోవాటెల్ హోటల్లో రెన్యువబుల్ ఎనర్జీ వర్క్ షాప్ జరగనుండగా, మధ్యాహ్నం అంతర్జాతీయ యోగా దినోత్సవ నిర్వహణ ఏర్పాట్లపై సమీక్ష జరగనుంది. అనంతరం వీఎంఆర్డీఏ పరిధిలో నూతనంగా నిర్మించిన డెక్ భవనం, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రారంభోత్సవాలు జరగనున్నాయి. అక్కడే కొన్ని పారిశ్రామిక సంస్థలు, ఐటీ సంస్థలతో ఒప్పందాలు జరగనున్నాయి. వీఎంఆర్డీఏ చిల్డ్రన్ ఎరీనాలో వివిధ పరిశ్రమలకు సంబంధించి శంకుస్థాపనలు, పారిశ్రామిక వేత్తలతో ముఖాముఖి నిర్వహించనున్నారు. ఈ మేరకు కలెక్టర్ సంబంధిత అధికారులకు వివిధ అంశాలపై దిశానిర్దేశం చేశారు.

యోగాంధ్ర శిక్షకులకు శిక్షణ

ఏయూ ఆధ్వర్యంలో 1200 మంది ట్రైనర్స్

మద్దిలపాలెం: విశాఖ వేదికగా ఈ నెల 21న జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమంలో ఆంధ్ర విశ్వవిద్యాలయం కీలక బాధ్యతలను నిర్వర్తిస్తోందని ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ అన్నారు. బుధవారం ఉదయం బీచ్ రోడ్డు యోగా విలేజ్‌లో ఏయూ ఉద్యోగులకు మూడు రోజుల యోగా శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1200 మంది ట్రైనర్స్‌ను తీర్చిదిద్దే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటికే అనుబంధ కళాశాలల్లో వెయ్యి మంది ట్రైనర్స్‌ను తయారు చేశామని, రానున్న రోజుల్లో మరికొంత మందిని సిద్ధం చేయనున్నట్లు పేర్కొన్నారు. 30 వేల మంది ఏకకాలంలో యోగా చేయడానికి అవసరమైన ఏర్పాట్లను ఏయూ మైదానాలలో ప్రభుత్వం చేస్తోందన్నారు. ఏయూ ఉద్యోగులు మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు, యోగా విభాగాధిపతి కె.రమేష్‌బాబు, క్రీడా విభాగం సంచాలకుడు ఆచార్య ఎన్.విజయ్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.